సత్యం పొక్కా, పేంటు విప్పి బనీను డ్రాయరుతో చెట్టెక్కడానికి సిద్ధపడ్డాడు. చుట్టూ వున్న కుర్రాళ్ళంతా సత్యం వంక చూసేరు. అందరి మొహాల్లోనూ ఆత్రుత. సత్యం ఎక్కగలడా లేడా అని! కొంత మంది. పళ్ళెప్పుడు తెంపుతాడా తిందామని చూస్తున్నారు.

సత్యం చెట్టు దగ్గరగా వెళ్ళి రెండు చేతులను కాండానికి రెండు వైపులా వేసి. చేతులతో గట్టిగా పట్టి పైకి ప్రాకేడు. చెట్లెక్కడం అతనికి కొత్త కాదు. ఆ ధైర్యంతోనే చెట్టెక్కడానికి సాహసించేడు. కాని తేమగా ఉండడం వలన చేతులకి అప్పుడప్పుడు పట్టు దొరకడంలేదు. కాళ్ళు మధ్య మధ్యలో జారుతున్నాయి.

"జాగ్రత్తరేయ్! పడ్డావంటే పూచీ నాదికాదు!!"

కిందనుండి అరిచేడు శ్రీను.

"పడనీవోయ్! శరీరం గట్టిపడుతుంది."

విశ్వం జోకుకి అంతా నవ్వేరు.

సత్యం ఇవేవీ లెక్కచెయ్యడంలేదు. మెల్లిమెల్లిగా మీదికి జరుగుతున్నాడు. రెండు నిముషాలు కష్టపడితే చాలు! శాఖ ఒకటి చేతికందితే చాలు!! తను పడే శ్రమకి ఫలితముంటుంది.

కొంచెం కొంచెం ప్రాకుతూ శాఖనొక దానిని పట్టుకొని పైకెగబ్రాకి, దానిమీద కూర్చుని విజయగర్వంతో కిందకి చూస్తూ.

"ఇప్పుడేవంటావ్! చెట్టెక్కగలిగేనా లేదా" అరిచేడు సత్యం.

శ్రీను ఏమీ మాట్లాడలేదు. ఈవిధంగా పందెం కాసి ఓడిపోవడం అతనెప్పుడూ ఎరగడు. పది రూపాయలకు నీళ్ళొదులు కొన్నాడు మనసులో.

"ఒరే ఎలాగూ ఎక్కేవు. కాసిని పళ్ళు తెంపి కిందపడేయరా. నీ పేరు చెప్పుకొని తింటాం." కిందనుంచి శరత్ అన్నాడు. అందరూ దానికి వంత పాడారు. సరేనన్నట్టుగా పళ్ళకోసం ఇంకో కొమ్మ మీదికి మారేడు సత్యం.

మీదనుండి ఒకటీ. ఒకటీ తెంపిన పళ్ళ గుతులు కిందికి వదులుతున్నాడు సత్యం. ప్రతి గుత్తిలో తనో రెండో మూడో రుచి చూస్తున్నాడు. తియ్యగా అమృతంలా ఉన్నాయి పళ్ళు.

"ఇక దిగమంటారా నన్ను?" చివర కొమ్మ నుంచి అరిచేడు సత్యం.

"ఒరే, నీ నెత్తిమీది గుత్తిచూడు. చాలా బాగుందది. అదొక్కటీ తెంపేసి దిగిపో." చెట్టు కింద గుంపులో నుంచి ఆచారి అరిచేడు.

తలపైకెత్తి చూసేడు సత్యం. తనకి కొంచెం మీదుగా పెద్ద గుత్తి ఒకటి కన్పించింది. పెద్ద పెద్ద పళ్ళతో బరువుగా వ్రేలాడుతూంది. ఒక చేత్తో పక్కనున్న కొమ్మ పట్టుకొని రెండో చేత్తో గుత్తిని అందుకోబోయేడు. కాని అది చేతికందలేదు. మునివేళ్ళ మీద నిలబడి అందుకోడానికి ప్రయత్నం చేసేడు.

అంతే! బేలన్సు తప్పి ముందుకు తూలిన సత్యం, ఆసరా కోసం కొమ్మనొక దానిని పట్టుకొన్నాడు. పెళుసుగా ఉన్న ఆ కొమ్మ, బరువుకి ఆగలేక ఫెళఫెళమని విరిగింది. అంచెలంచెలుగా నేల మీదకి పడిపోతున్న సత్యంని స్నేహితులంతా కలిసి పట్టుకున్నారు.

సత్యంని అంతా బాగా కాశారు. ఒక్క దెబ్బ తగలకుండా పట్టుకున్నారు. పట్టుకున్న అందరికీ చేతులు బెణికేయి.

---

అది ఓ స్కూలు.




అందులో అన్ని సౌకర్యాలు వుంటాయి. అక్కడి ఉపాధ్యాయులు - మార్గదర్శకులు!!! - పిల్లల మనస్తత్వాన్ని బట్టే నడుచుకుంటారు. యే పిల్లవాడు ఏది కావాలన్నా నిమిషాల మీద ఏర్పాట్లు చేస్తారు. దాన్లో ధనవంతుల బిడ్డలు తప్ప. చలిచీమల పిల్లలు చదవడానికి తాహతు అడ్డొస్తుంది.

ఆ స్కూల్లో "ఫ్రీ ఆర్ట్స్" విభాగం ప్రత్యేకంగా వుంది. అక్కడి విద్యార్థులకు కళలలో అవగాహన కలిగించడం ఆ స్కూలు లక్ష్యాలలో ఒకటి. దాన్లో చేరిన విద్యార్థికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వబడుతుంది. ఆ అబ్బాయి ఎన్నుకున్న విషయంలోనే అతనికి శిక్షణ ఇవ్వబడుతుంది.

ఒకానొక రోజు ఆ స్కూల్ను చూద్దామనుకుని వచ్చిన మంత్రిగారు ఫ్రీ ఆర్ట్స్ సెక్షన్ కూడా సందర్శించాలని సంకల్పించుకున్నారు.

పిల్లలు ఎవరి పనులలో వాళ్ళు నిమగ్నులై అక్కడున్న సామాగ్రితో "మినీ కళాఖండాలు" సృష్టిస్తున్నారు. అందులో మట్టితో మూర్తులను తయారుచేస్తున్న అబ్బాయిపైన మంత్రిగారి చూపు నిలిచిపోయింది.

అతన్ని సమీపించి జిజ్ఞాసగా "అబ్బాయ్! ఏం చేస్తున్నావు" అని అడిగారు. మంత్రిగారి పిలుపుకు కూడా తన పనిలోనుండి దృష్టి మరల్చకుండానే "మా మాస్టర్ గారిని తయారుచేస్తున్నాను" జవాబిచ్చాడు. మంత్రిగారు మాస్టర్‌గారివైపు చూసి ముసిముసి నవ్వులు చిలకబోశారు. మళ్ళీ ఆ అబ్బాయి భుజంమీద ప్రేమగా చేయి వేసి "బాబూ! మంత్రిగారి బొమ్మను చేయరాదా?" అని ప్రశ్నించారు.

ఆ అబ్బాయి ఒక్కక్షణం తన పనిలో నుండి బయటపడి, వేళ్ళ మధ్య అంటుకున్న మట్టిని లాగేస్తూ తలెత్తి మంత్రిగారి ముఖంలోకి చూసి "క్షమించండి. అందుక్కావలసిన పేడ నా దగ్గర లేదు" అని జవాబిచ్చాడు. ★

---

చిరంజీవి చురుకుదనం చూసిన వారందరూ చలాకీ కుర్రోడనే వారు.




చలాకీ కుర్రోడు చాన్నాళ్ళనుంచి ఒక విషయం ఆలోచిస్తూండేవాడు. అది సులువుగా డబ్బు సంపాదన గురించి. ఐతే ఓ రోజు లైబ్రరీలో కూర్చుని ఒక తెలుగు పత్రికలో పడ్డ ప్రకటన తనని ఆకట్టుకుంది. అతి సులువుగా ఎక్కువ డబ్బు సంపాదించేందుకు మార్గమది. ఒక్కసారి ఆనందం పట్టలేక ఎగిరి గంతేయాలనుకున్నాడు. చుట్టూ లైబ్రరీలో దీక్షగా చదువుకుంటున్న వాళ్ళని. గోడమీద 'నిశ్శబ్దం'

అన్న బోర్డుని చూసి ఆనందాన్ని ఆపుకున్నాడు.

సినీ తారామణుల అర్ధనగ్న చిత్రాల్ని కట్ చేయడానికి వుపయోగపడే తన జేబులోని బ్లేడు తీసి ఆ పత్రిక పట్టుకుని ఓ మూలకేసిపోయాడు. ఎవరూ చూడకుండా ఆ ప్రకటనని జాగ్రత్తగా కట్ చేసి జేబులో పెట్టుకుని బైటికొచ్చేశాడు. "ఓస్ః అంత పెద్ద సలహాకి ఒక్క రూపాయి అడ్రసుతో మనియార్డరు చెయ్యడమేకదా" అని ఆనందపడిపోయాడు. ఆ రోజు రాత్రంతా ఎంత వేగిరం పోస్టాఫీసుకెళ్ళి తననుకున్న పని చేద్దామా అని ఇంచుమించు జాగారమే చేశాడు. ఎప్పటిలాగే తెల్లవారగా, అతి సులువుగా డబ్బు సంపాదనకై రూపాయి మనియార్డరు చేసి కుదుటపడ్డ మనసుతో హాయిహాయంటూ ఇంటికెళ్ళిపోయాడు.

మనియార్డరు చేసిన మర్నాటినించీ తన కొచ్చే సలహాకోసం ఆత్రంగా ఎదురు చూడ సాగేడు. ఇట్టే గడిచిపోయాయి మూడు నెలలు. చలాకీకుర్రోడు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రోజు వచ్చింది. ఆరోజు సాయంత్రం మామూలుగా లైబ్రరీకెళ్ళిన చలాకీ కుర్రోడికి, ఇదివరకటి ప్రకటన తాలూకు సలహా మార్గం పత్రికలోచూసి ఆశ్చర్యపోయాడు. ఆత్రంగా చదివి కుర్చీలో కూలబడిపోయాడు. ఇంతకూ జరిగిన విషయమేమిటంటే అతి సులువుగా డబ్బు సంపాదించడం ఎట్లా, అనే ప్రశ్నకు 'ట్రిక్' సమాధానం ఏమిటంటే "ఇదివరకు మేము ప్రకటించిన ప్రకటననిచూసి చాలామంది వారి వారి ఎడ్రసులతో ఒక్కో రూపాయి మనియార్డరు చెయ్యడంవలన మాకు అరవైవేల రూపాయలొచ్చాయి చూశారా! ఒకే ఒక ప్రకటన ఎంత సులువుగా డబ్బుతెచ్చిందో! ఇలాంటి ట్రిక్కులే మీరు చేస్తే అతి సులువుగా సొమ్ము సంపాదించగలరు" అని వుంది.

అంత చలాకీ కుర్రాడూ ఒక్కసారి కంగుతిన్నాడు "ఇందులో నేనొక్కణ్ణే ఫూల్‌ని కాదు. దేశంలో నాలాంటి ఫూల్స్ చాలామంది వున్నారు" అని మట్టుకు సరిపెట్టుకున్నాడు!

---

జీతం తీసుకొని శంకరరావు లెక్కపెట్టుకున్నాడు.




అతను జిల్లాపరిషత ఆఫీసులోగుమస్తా. సాయంత్రం ఆరుగంటలకు సీటు సర్దుకొని ఇంటిముఖం పట్టాడు. కొంతదూరం వెళ్ళాక జీతం డబ్బు మరోసారి కళ్ళారా చూసుకుందామని జేబులో చెయ్యిపెట్టాడు. డబ్బు లేదు!

కంగారుగా వెతుక్కున్నాడు.

డబ్బు లేదు. పోయింది. నడిరోడ్డుమీద జేబుకాటు. అడుగు ముందుకు సాగలేదు. ముప్పైరోజుల కష్టార్జితం. వెంటనే వెనక్కు తిరిగి తన సీటు దగ్గరకెళ్ళి వెతుక్కున్నాడు. ప్రయోజనం శూన్యం. జీతాలిచ్చే రూమ్ దగ్గరకెళ్ళి చూశాడు. అక్కడ చూడ్డం అనవసరం. తలుపులు వేసి వున్నాయి. తాళం మీది సీలు ఎర్రటి నాలుకతో వెక్కిరించింది అతన్ని.

శంకర్రావు బాధగా నిట్టూర్చాడు. రోడ్డు వారగా నడువసాగాడు.

ఒక నెల కష్టార్జితం. ఐదు వందల పాతిక రూపాయలు. ఆ నెలలో అదనంగా యింక్రిమెంట్ల డబ్బు కూడా వచ్చింది కనుక రెండు వందలు బ్యాంక్‌లో వేసి తను దాచుకున్న డబ్బు మొత్తం మూడు వేలు చేయాలనుకున్నాడు. అలాంటిది మొత్తానికే పోయింది.

వస్తుతః శంకర్రావు కూడిక మనిషే. పెళ్ళయ్యాక కొంత, కొడుకు పుట్టాక మరి కొంత, ఆడపిల్ల పుట్టాక పూర్తిగా పిసనారితనం అలవాటు చేసుకున్నాడు.

ఇప్పుడు నెలకి వంద రూపాయలు చొప్పున బ్యాంకిలో వేస్తున్నాడు కొన్నాళ్ళుగా. ఇప్పుడది ఇరవై ఎనిమిది వందలయింది. ఈ నెలలో అదనంగా యింక్రిమెంట్ల సొమ్ము కూడా వచ్చింది కాబట్టి


ప్రతి నెల రు. 1000/-లు సంపాదించండి

ఎలక్ట్రిక్ గైడ్ రు. 10/-; ఫొటోగ్రఫీ రు. 6/-; 100 బొమ్మలతో వివాహ జీవితం రు. 7/-; 88 బొమ్మలతో మెడికల్ సెక్స్ గైడ్ రు. 10/-; టైలరింగ్ & కటింగ్ రు. 7/-; డ్రాయింగ్ & పెయింటింగ్ రు. 8/-; 350 ఎంబ్రాయిడరీ డిజైన్లు రు. 8/-; 300 కాటేజి ఇండస్ట్రీ గైడ్ రు. 12/-; రేడియోగైడ్ బొమ్మలతో రు. 10/- పోస్టేజి 1.50 ఒక్కొక్క దానికి.

ILFA BOOK DEPOT
Aligarh-25.



వార్తలకు, వ్యాఖ్యలకు
"ఆంధ్ర జ్యోతి"
దిన పత్రికనే చదవండి.



గుప్తరోగములకు చికిత్స

ఏ కారణముల చేతనైనా శక్తి, యవ్వనం పోగొట్టుకున్నచో స్పెషల్ ధాతు పౌష్టిక్ చూర్ణ" వాడండి. స్వప్న స్ఖలనము, శీఘ్రస్ఖలనము, వీర్యము పలుచనగుట, బలహీనత, నీరుడుతో వీర్యము పోవుట ఇంకా ఇతర ఇబ్బందులపై మందు ఉపయోగించుటవలన నయమగును. వెల రు. 15/- పూర్తి కోర్సు రు. 40/- త్వరపడి వ్రాయండి.

BASANT PHARMACY (D.P)
P. o MAIRA BARITH (PATNA)
P.C 805 105.



మ్యాజిక్ బుక్ : అను మహా గారడిజాల రహస్యం. తంత్ర విద్యలు ఆశ్చర్యపడగల ఎన్నో ట్రిక్కులు వివరించబడినది నేర్చుకొనవచ్చును. పోస్టు ఖర్చుతో రూ. 5-00. కుట్టుపని స్వబోధిని : రకరకాల దుస్తులు స్వయంగా కత్తిరించి కుట్టు నేర్చుకొనవచ్చును. చిత్రపటములతో పోస్టు ఖర్చుతో రూ 7-00. వర్తక రహస్యములు : స్నో. సిరా దినుసులు. అగరవత్తులు. పళ్ళపొడి. హేరాయిలు. అత్తరు చేయు రహస్యాలు ఉన్నాయి. పోస్టు ఖర్చుతో రూ 8-00. కొక్కోకము : (బొమ్మలతో) రూ. 5 00.

SRI DEVI BOOK DEPOT
No-5 Ratna Mudali Street,
Madres-1.